క్లుప్తంగా

నక్కలపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలి


డీఎం జనార్దన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలఅర్బన్: చెన్నూర్ నుంచి కోటపల్లి మండలం నక్కలపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల డీఎం జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. నక్కలపల్లికి బస్సులు లేకపోవటంతో స్కూల్‌పిల్లలు, ప్రజలు ఇబ్బందులు పడుతన్నారని దృష్టికి తీసుకొచ్చారు. బస్సులు లేకపోవటంతో ప్రైవేట్ వాహనడ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు ట్రిప్పులు బస్సు నడపటం వల్ల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని డీఎం దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్, జాతీయ కార్యవర్గ సభ్యుడు పురుషోత్తం, కోటపల్లి మండల్ ఇన్‌చార్జి నాగేశ్వరావు, మంత్రి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు ఏర్పాటు


మాట్లాడుతున్న ఏడీఈ బాలకృష్ణ

చెన్నూర్‌రూరల్: వేసవికాలంలో లో వోల్టేజీ సమస్య రాకుండా పంటలు కాపాడాలనే ఉద్దేశంతో లైన్ కెపాసిటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. మండలంలోని నాగాపూర్ ఫీడర్ పరిధిలోని చాకెపల్లిలో పంట పొలాల వద్ద బుధవారం లైన్ కెపాసిటర్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తక్కువ వోల్టేజ్ సమస్య రాకుండా ఉండేందుకు రక్షణ చర్యల్లో భాగంగా కెపాసిటర్లు ఏర్పాటు చేసినట్లు తెలి పారు. కొమ్మెర ఏఈ కేశెట్టి శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌రెడ్డి, రాజమల్లు, లైన్‌మెన్లు ఉన్నారు.

రేపు కూరగాయల మార్కెట్ బంద్

మంచిర్యాలఅగ్రికల్చర్: హోలీ పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం కూరగాయల మార్కెట్ బంద్ ఉంటుందని కూరగాయల మార్కెట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట సత్యనారాయణ, చింతపండు శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాడీ బిల్డర్లకు సన్మానం


సన్మానిస్తున్న జిమ్ నిర్వాహకులు, బాడీ బిల్డర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్, మంచిర్యాల బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నస్పూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన జూనియర్, సీనియర్, మాస్టర్ డిస్ట్రిక్ట్ బాడీ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన బాడీ బిల్డర్లను బుధవారం మంచిర్యాలలోని చాంపియన్ జిమ్‌లో ఘనంగా సన్మానించారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న 11 మంది విజేతలుగా నిలిచారు. మిస్టర్ ఆదిలాబాద్‌గా, మిస్టర్ మంచిర్యాలగానే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన చాంపియన్స్ ఆఫ్ ఛాంపియన్స్ విభాగంలో పాతమంచిర్యాలకు చెందిన మాసు వెంకటేశ్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాడు. మాసు వెంకటేశ్, ముడిమడుగుల శ్రీనివాస్, విశ్వనాథ్, శ్యాం, ప్రదీప్‌కుమార్, శివకుమార్, మల్లన్న, శశాంక్, మధు, కుమార్, భీమన్నలు వివిధ కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించగా శాలువాతో జిమ్ నిర్వాహకులు సన్మానించారు. చాంపియన్ జిమ్ నిర్వాహకులు సుదర్శన్‌గౌడ్, కొయ్యాడ విద్యాసాగర్‌గౌడ్, సభ్యులు బక్కన్న, మల్లేశ్, మధు, ఆరీఫ్, సతీశ్, నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నోటిఫికేషన్ రద్దు చేయాలి

జైపూర్: సింగరేణిలో చీఫ్ ఆఫ్ మెడికల్, సెక్యూరిటీ అధికారుల కాంట్రాక్టు నియామక నోటిఫికేషన్ రద్దు చేసి సింగరేణిలో అనుభవం ఉన్నత అధికారులను నియమించాలని అధికారుల సంఘం ఆధ్వర్యంలో జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఇంచార్జి ఈడీ శ్రీనివాసులుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు అడ్మిన్ భవన కార్యాలయంలో ఈడీని కలిసి బయట వ్యక్తులను కీలక శాఖల్లో నియమించడం వల్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంవోఏఐ నాయకులు అజ్మీరా తుకరాం, అప్పారావు, శివప్రసాద్, శ్రీనాథ్, రమేశ్, మోహన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

హోలీ సందడి షురూ!



బార్బీ చిత్రంతో కూడిన గన్



దుకాణంలో రసాయనాలులేని రంగుల ప్యాకెట్లు


ఏనుగు ఆకృతిలో రంగుల గన్



పోలీస్ తుపాకీ ఆకారంలో...



హోలీ పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలో రంగుల దుకాణాలు వెలిశాయి. ఈ ఏడాది రసాయన రంగులే కాకుండా సహజరంగులను కూడా మార్కెట్లో దిగుమతి చేసుకున్నారు. అంగరంగ వైభవంగా, ఉల్లాసంగా ఉత్సాహంగా కలర్‌ఫుల్‌గా జరుపుకునేలా చిన్నారుల కోసం గులాల్ కలర్లు, హెర్బల్ పౌడర్, స్ప్రేలు, వివిధ రకాలు గన్‌లు ఆకర్షిస్తున్నాయి. టీవీలో చూసే షోలకు సంబంధించిన బెన్, డోరీమాన్, బార్బీ, ఏనుగు, వాటర్‌ట్యాంకు, కేజీఎఫ్ గన్‌లు మార్కెట్లో లభిస్తున్నాయి. ధరలు రూ.20నుంచి రూ.500వరకు పలుకుతున్నాయి. – మంచిర్యాలఅర్బన్

పారిశుధ్య పనుల పరిశీలన


కార్యదర్శితో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

తాండూర్: గ్రామాల్లో పారిశుధ్యం పనులు సక్రమంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. మండలంలోని తాండూర్, కిష్టంపేట, రాజీవ్‌నగర్ గ్రామ పంచాయతీలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పల్లెల్లో నిర్వహిస్తున్న పారిశుధ్యం పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించి డంప్ యార్డ్‌కు పంపించాలన్నారు. సెగ్రిగేషన్, నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ప్లాస్టిక్ బాటిల్స్, వ్యర్థ పదార్థాలు రోడ్డు పక్కన వీధుల్లో కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లెల్లో పారిశుధ్యం పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. ఇంటి పన్ను వసూలు అన్ని గ్రామ పంచాయతీల్లో వందశాతం పూర్తి చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి వెంట మండల పంచాయతీ అధికారి జి.అనిల్‌కుమార్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఉదయ్‌కుమార్, దివాకర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీవో విస్తృత పర్యటన


ఈజీఎస్ పనులపై ఆరా తీస్తున్న డీఆర్డీవో కిషన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి, దొనబండ, చిన్నగోపాల్‌పూర్ గ్రామ పంచాయతీల్లో డీఆర్డీఓ, మండల ప్రత్యేకాధికారి కిషన్ ఆకస్మిక పర్యటనలో భాగంగా విస్తృతంగా తనిఖీలు జరిపారు. ఆయా గ్రామాల్లో ఈజీఎస్ కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్మికులకు ఉపాధి, పనిదినాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని స్పష్టంగా సూచించారు. జిల్లా, మండల పరిషత్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మమేకమై పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మెనూను పర్యవేక్షించడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఎంపీడీవో ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు నరేందర్, వెంకటస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

పారిశుధ్యంపై పట్టింపు కరువు



భీమారం: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో పారిశుధ్య నిర్వహనను అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి సీసీ రోడ్లు నిర్మించినప్పటికీ, గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్లపైనే ఎడ్లబండ్లతో పాటు పశువుల పేడ వేస్తున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : మధుసూదన్, ప్రత్యేకాధికారి, నర్సింగాపూర్

ఫోన్ నంబర్ : 94400 21333

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హెచ్చరించారు. బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయం ఆవరణంలో బుధవారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. అనవసరమైన తగాదాల్లో, వివాదాల్లో తలదూర్చవద్దని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే తీవ్ర చర్యలకు బాధ్యులవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం బోనస్ చెల్లించాలని రాస్తారోకో


దండేపల్లిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

దండేపల్లి: సన్నరకం ధాన్యం బోనస్ చెల్లించాలని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం దండేపల్లి, వెంకటాపూర్ గ్రామాల మధ్య వాగు సమీపంలోని రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన రైతులకు రైతుభరో సా కల్పించాలని, పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని అన్నారు. ఎస్సైలు తహసీనొద్దీన్, రాజవర్ధన్ ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీజేపీ నాయకులు తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కాగా, ఆందోళన విషయం తెలియడంతో పోలీసులు ముందస్తుగా కొందరు బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

హామీలు అడిగితే అరెస్టు చేస్తారా..?

మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్ (హాజీపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని అడిగితే బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో బీజేపీ నాయకులను అరెస్టు చేసి నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారని తెలిపారు. ఎమ్మెల్యే బెదిరింపులకు బీజేపీ భయపడే ప్రసక్తే లేదని, గత సీజన్‌లో కొనుగోలు చేసిన వడ్లకు ఇప్పటికీ బోనస్‌ను ప్రభుత్వం చెల్లించలేదని, అసంపూర్తిగా రుణమాఫీ చేసి మొత్తం రైతులను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు రైతుల పక్షాన, ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. రైతు ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

బొగ్గుబాయి వార్తలు

యూనిట్లు పెట్టుకుని రాణించాలి


మాలతిని సన్మానిస్తున్న ఏరియా సేవాసభ్యులు

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు సొంతంగా యూనిట్‌లు పెట్టుకొని రాణించాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్) సతీమణి ఎల్. మాలతి తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు ఆర్థికంగా తమ కాళ్ల మీద తాము నిలబడాలన్నారు. మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో అనేక మంది మహిళలకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పలు వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఏరియా సేవా అధ్యక్షురాలు ఉమారాణి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం శ్రీరాంపూర్‌లో 619మందికి వివిధ కోర్సుల్లో శిక్షణ అందించామన్నారు. వచ్చే సంవత్సరం మరింత మందికి శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా సేవా సభ్యులు మాలతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, సేవా సెక్రెటరీ కొట్టే జ్యోతి సభ్యులు పాల్గొన్నారు.

ఉత్పత్తిలో ఆర్కే 6 గని ఆదర్శం

• జీఎం శ్రీనివాస్


జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గని అధికారులు

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తిలో ఆర్కే6 గని ఇతర గనులకు ఆదర్శంగా నిలిచిందని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఆ గనిపై బుధవారం వార్షిక ఉత్పత్తిని ముందే సాధించిన సందర్భంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం వార్షిక ఉత్పత్తి లక్ష్యం 1.8లక్షల టన్నులను ఈ నెల 31నాటికి సాధించాల్సి ఉంటే దానికి 20రోజుల ముందే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అభినందనీయం అన్నారు. దీనికి కృషి చేసిన ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా జీఎంను గని అధికారులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏజెంట్ శ్రీధర్, మేనేజర్ తిరుపతి, గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అ ధికారి రాంనర్సయ్య, సంక్షేమ అధికారి సురేందర్, గుర్తింపు సంఘం నాయకులు ముస్కే సమ్మయ్య, సంగం సదానందం తదితరులు పాల్గొన్నారు.

‘బయట వ్యక్తులను కీలక పోస్టుల్లో తీసుకోవద్దు’

శ్రీరాంపూర్: సింగరేణిలో కీలక పోస్టుల్లో బయటి వ్యక్తులను నియమించొద్దని సింగరేణి అధికారులను సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సీఎండీని ఉద్దేశించి రాసిన వినతిపత్రాన్ని బుధవారం ఏరియా జీఎం శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సింగరేణి చీఫ్ మెడికల్ సర్వీసెస్, చీఫ్ సెక్యూరిటీ అధికారిని బయట నుంచి తీసుకోవడానికి యాజమాన్యం ఉద్యోగ ప్రకటన విడుదల చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కంపెనీలో ఎంతో మంది అనుభవజ్ఞులైన అధికారులు ఉన్నారని, వారిని కాదని బయటివారిని తీసుకోవడం వల్ల తమ మనోభావాలు దెబ్బతింటాయన్నారు. బయటి వ్యక్తులకు సంస్థ నియమ నిబంధనలు, పద్ధతులపై అవగాహన చాలా తక్కువగా ఉంటుందన్నారు. సంస్థ నష్టాల్లో కూరుకుపోయి బీఐఎఫ్ఆర్ పరిధిలోకి వెళ్లినప్పుడు ఉద్యోగులు, అధికారులు కష్టపడి పనిచేసి సంస్థను తిరిగి లాభాలు వచ్చేలా చేశారన్నారు. నేడు యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఉద్యోగ ప్రకటనలు ఇవ్వరాదని కోరారు. దీని వల్ల కంపెనీలో పనిచేసే అధికారుల మనోభావాలు దెబ్బతిని సంస్థ అభివృద్ధిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్‌తోపాటు నాయకులు డాక్టర్ రమేశ్‌బాబు, లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిగనిలో పని చేస్తున్న గైర్హాజరు కార్మికులకు సింగరేణి అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. గని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విధులకు సరిగ్గా హాజరు కాని కార్మికులను కౌన్సెలింగ్‌కు పిలిపించి మాట్లాడారు. ఏ కారణంగా విధులకు సక్రమంగా హాజరుకావడం లేదో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం విధులకు హాజరు కావాలని, లేకపోతే చర్యలు తప్పవని తెలిపారు.

గ్రూపు–2కు ఎంపికైన మందమర్రి యువకులు


బొడ్డు తిరుపతి   వినయ్‌కుమార్

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన బొడ్డు పోశక్క– భూమయ్య దంపతుల కుమారుడు తిరుపతి గ్రూప్–2 పరీక్షా ఫలితాల్లో 77వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం క్యాతనపల్లి మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న అవుల దేవేందర్–తులసి దంపతుల కుమారుడు వినయ్‌కుమార్ యాదవ్ 117వ ర్యాంకు సాధించాడు. గ్రూప్–2లో ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులతో పాటు కాలనీలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హైటెక్ దోబీఘాట్‌లు నిర్మించాలి

పాతమంచిర్యాల: మున్సిపాలిటీ ప్రాంతాల్లో, నగరాల్లో అధునాతన దోబీఘాట్స్ నిర్మించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి, యూత్ గౌరవ అధ్యక్షుడు సంగెపు ఎల్లన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రజకులు సాంప్రదాయ పద్ధతుల్లో కులవృత్తిని కొనసాగిస్తున్నారని, అధునాతన టెక్నాలజీతో హైదరాబాద్ లాంటి నగరాలతో పాటు మున్సిపాలిటీల్లో బెంగుళూరు తరహాలో అధునాతన దోబీఘాట్లు నిర్మించాలన్నారు. మున్సిపాలిటీలో దోబీఘాట్ కోసం ఎకరం భూమి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంగం లక్ష్మణ్, ఉపాధ్యక్షులు కొలిపాక రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మొగుళ్ల రాజయ్య, ముప్పు రాజమల్లు, ఓరుగంటి ఎల్లయ్య, వెంకటేష్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.